# పశ్చిమ అభివృద్ధిలో కీలక ఘట్టం

- మూడు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ప్రారంభం
- యువతకు అత్యాధునిక శిక్షణ
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ATC)లను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు ప్రారంభించారు. రూ. 22 కోట్ల వ్యయంతో వరంగల్ నగరంలో ఈ మూడు ఏటీసీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ములుగు రోడ్డులోని ఐటీఐ కళాశాలలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికత పరమైన వృత్తి నైపుణ్యం నేటి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి చాలా కీలకమని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృత్తి విద్యా నైపుణ్యత అభివృద్ధి అవసరాన్ని గుర్తించి, రాష్ట్ర వ్యాప్తంగా 65 ఏటీసీ సెంటర్లను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేడు వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. వరంగల్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను ఎమ్మెల్యే నాయిని, ఎంపీ కడియం కావ్య, శాసన మండలి సభ్యుడు బస్వరాజు సారయ్యతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ. 22 కోట్లతో నిర్మించిన ఈ ఏటీసీ సెంటర్ల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, డిజిటల్ విద్యను అందించడానికి దోహదపడుతుందని ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. ఈ కేంద్రాల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు అత్యాధునిక శిక్షణ అందడంతో పాటు, వారి కెరీర్‌కు దిశానిర్దేశం జరగనుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా టాటా గ్రూప్స్ తో కలిసి ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ స్కిల్ డెవలప్‌మెంట్ యజ్ఞంలో మన నియోజకవర్గానికి ప్రాధాన్యత లభించడం గర్వకారణమని ఆయన అన్నారు. ఈ మూడు కేంద్రాలలో విద్యార్థులకు ఇండస్ట్రీకి అనుగుణమైన శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్, వెల్డింగ్, సీఎన్ సీ, రోబోటిక్స్, డిజిటల్ స్కిల్స్ లాంటి విభాగాలలో ప్రాక్టికల్, థియరీ శిక్షణ లభించనుంది. సుదీర్ఘ చరిత్ర కలిగిన ములుగు రోడ్డు ఐటీఐ కళాశాల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యేగా తాను ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే నాయిని హామీ ఇచ్చారు. అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన్నెపల్లి వేదికగా వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఏటీసీ సెంటర్ ప్రారంభోత్సవ సందేశాన్ని అందరూ వీక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, స్థానిక కార్పొరేటర్లు దేవరకొండ విజయ సురేందర్, సయ్యద్ విజయశ్రీ రాజాలీ, డివిజన్ అధ్యక్షులు సంగీత్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపదలో స్నేహితుల ఆర్థిక చేయూత



**వరంగల్ వాయిస్, శాయంపేట :** స్నేహబంధం గొప్పదనాన్ని చాటుతూ, శాయంపేట మండలం పెద్దకోడపాక గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి 10వ తరగతి మిత్రులు అండగా నిలిచారు. పెద్దకోడపాక గ్రామానికి చెందిన మంద జంపయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు మంద సురేష్కు చెందిన 2005 బ్యాచ్ పదవ తరగతి స్నేహితులు వెంటనే స్పందించారు. సురేష్ ఇంటికి చేరుకున్న మిత్రులు, వారి తండ్రి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అంతేకాకుండా, బాధిత కుటుంబానికి తమవంతు సహాయంగా రూ.25,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా నిలిచారు.ఈ కార్యక్రమంలో దాసి శ్రావణ్ కుమార్, రంగు రాజేష్, కోగిల సుమన్, ఫైండ్ల భాను, మోరె సుమన్, కోగిల తిరుపతి, బైని కర్ణాకర్, అల్లూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు స్వాగతిస్తున్నాం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడాన్ని స్వాగతిస్తున్నామని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా కో–ఆర్డినేటర్ కల్లూరి పవన్ అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఈ నిర్ణయం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ గతంలో అనేక పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ, బీసీలకు ఎలాంటి న్యాయం జరగలేదని అన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేస్తూ జీవో 9 విడుదల చేయడాన్ని స్వాగతిస్తున్నామని, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "రాబోయే రోజుల్లో బీసీలకు రాజకీయంగా ఎదిగేందుకు ఈ 42% రిజర్వేషన్లు గొప్ప అవకాశాలను కల్పిస్తాయి" అని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు గాను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్ గౌడ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పేదల సంక్షేమానికి పెద్దపీట



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత తనదేనని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు స్పష్టం చేశారు. శనివారం సుబేదారిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాజీపేట మండలం పరిధిలోని 44, 45, 46, 64 డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు ఆయన చెక్కులను పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లకు చెందిన 10 మంది లబ్ధిదారులకు రూ. 10 లక్షల 1,160 విలువైన చెక్కులు పంపిణీ చేశారు. అలాగ, ముఖ్యమంత్రి సహాయ నిధికి చెందిన 13 మంది లబ్ధిదారులకు రూ. 4 లక్షల 50,430 విలువగల చెక్కులు అందజేశారు. మొత్తంగా రూ. 14.5 లక్షలకు పైగా విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమాన్ని ఆపకుండా పథకాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. "సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదు, అర్హులు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని" ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాజీపేట మండల ఎమ్మార్వో బావుసింగ్, మండల అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

### ప్రయాణికులకు స్వల్ప గాయాలు




**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణంలోని భూపాలపల్లి రోడ్డులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, ప్రయాణికుల కథనం ప్రకారం... గిద్ద ముత్తారం నుంచి పరకాలకు వస్తున్న TS 25T4488 నెంబరు గల ఆర్టీసీ హైర్ పర్చేస్ బస్సు (పరకాల డిపోకు చెందింది), పరకాల పట్టణం కనకదుర్గమ్మ గుడి పక్కన ప్రయాణిస్తుండగా, ఒక కారు దానికి రాసుకుంటూ వెళ్లింది. దీంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సడన్గా బ్రేక్ వేయడంతో, వెనుక వస్తున్న భూపాలపల్లి డిపోకు చెందిన TS 26 Z 00 29 నెంబరు గల మరో ఆర్టీసీ బస్సు (భూపాలపల్లి నుంచి హనుమకొండకు వెళ్తున్నది), ముందున్న బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ఢీకొనడంతో బస్సు అద్దాలు పగిలిపోయాయి, అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై అధికారులు విచారణ చేపట్టారు.

## పండుగ వేళ పేదింట్లో విషాదం

### బాధిత కుటుంబానికి మాజీ కౌన్సిలర్ చేయూత



**వరంగల్ వాయిస్, పరకాల :** బతుకమ్మ పండుగ వేళ రాజీపేట గ్రామంలో విషాదం నెలకొంది. ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందిన ఇంటి పెద్ద దిక్కు ముదిగొండ రఘు (పద్మశాలి) కుటుంబం అనాథగా మారింది. ఇద్దరు ఆడపిల్లలతో తల్లి కొద్ది రోజులుగా వానలో తడుస్తూ, బిక్కుబిక్కుమంటూ జీవనం గడుపుతున్న దుర్భర పరిస్థితిని తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ మానవత్వంతో స్పందించారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామం రాజీపేటలో నివాసం ఉంటున్న ముదిగొండ రఘు కుటుంబాన్ని 9వ వార్డు తాజా మాజీ కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణ చారి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆ కుటుంబానికి 50 కిలోల బియ్యంతో పాటు కిరాణా సామాను అందజేసి ఆర్థిక చేయూత అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. ఈ నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఈ సందర్భంగా పూర్ణ చారి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరకాల పట్టణ బీజేపీ నాయకులు ధర్నా నారాయణ దాస్, వేముల అశోక్, వావిలాల రాజయ్య, కొర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు.శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల టౌన్, మండలాలకు చెందిన 111 మంది అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వీటి మొత్తం విలువ రూ. 1 కోటి 11 లక్షల 12,826గా ఉంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటివరకు మొత్తం 2,121 మందికి కళ్యాణలక్ష్మి ద్వారా రూ. 21 కోట్ల 23 లక్షల 4,636 చెక్కులను పంపిణీ చేశామని తెలిపారు. అలాగే, సీఎంఆర్ఎఫ్ ద్వారా 2,112 మందికి రూ. 6 కోట్ల 89 లక్షల 20 వేల రూపాయలను పంపిణీ చేశామని అన్నారు. కళ్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడబిడ్డల పెళ్లికి నిజంగా ఒక వరంగా మారిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ఎంతో మంది నిరుపేద కుటుంబాలకు ఆడపిల్లల పెళ్లి భారం తగ్గిందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే కళ్యాణలక్ష్మి చెక్కులు అలస్యమయ్యాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఇకపై సకాలంలో లబ్ధిదారులకు చెక్కులు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని, ఇది ప్రజల ప్రభుత్వం అని స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకల్లోనూ రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.